# సుజన

**శ్రీనిలయం ముందు కారు ఆగింది.**

**మేం కారు దిగగానే ఆత్మీయుల స్పర్శలా హాయనిపించే ప్రాతః కాలపు పిల్లగాలి పూల పరిమళాలను వెదజల్లుతూ పరామర్శ చేసింది.**

**సరిగ్గా అప్పుడే ఎక్కడినుండో ఓ కోయిల "కూ.." అంటూ రాగం తీసింది మాకు స్వాగతం చెబుతున్నట్లుగా.**

**ఆ ప్రశాంత ప్రభాత సమయంలో కోయిల తీయని పలకరింపుకూ, చల్లగాలి అలరింపుకూ మనసు పులకించింది. ప్రకృతి కూడా మమ్మల్ని మౌనంగా, మధురంగా ఆశీర్వదిస్తున్న అనుభూతి కలిగింది!**

ఒక క్షణం కళ్ళెత్తి పరిశీలనగా చూశాను.

శ్రీనిలయం...

ఇంకా పూర్తిగా కరిగిపోని తెలిమంచు తెరల మధ్య మేలి ముసుగు ధరించిన మహారాజ్ఞిలా మనోజ్ఞంగా ఉంది! అందంగా, అట్టహాసంగా ఉన్న ఆ భవనం నిజంగా 'శ్రీ'కి నిలయమే సుమా అన్నట్లుగానూ ఉంది! ఆ ఆవరణనంతా శోభాయమానమూ, పరిమళభరితమూ కావిస్తున్న రంగు రంగుల క్రోటన్సు, రకరకాల పూల మొక్కలూ మాకు ఆహ్వానం పలుకుతున్నట్టుగా చిరుగాలి అలలకు అందంగా తలలూపుతున్నాయి!

నేటి నుండీ జీవితం కొత్త మలుపు తిరిగి కొత్త పరిసరాలలో, కొత్త వ్యక్తుల మధ్య కొనసాగబోతోంది!

ఒక క్షణం ఏదో తెలియని సంకోచంతో మనసు రెపరెపలాడింది.

బెరుకుగా నిలబడిపోయిన నా వేపు విష్ణు చిరునవ్వుతో చూసి నా అరచేతిని పట్టుకుని మెల్లగా నొక్కారు. ఆ స్నేహపూర్వక స్పర్శ .... చూపు నుండి నాకేదో ఉత్సాహం అంది వచ్చినట్లయింది! నా సంకోచం చెల్లా చెదురైపోయింది!

నేను కోరుకున్న, నన్నే కావాలనుకున్న వ్యక్తితోనే జీవితాన్ని పంచుకోగలుగుతున్న అదృష్టవంతురాలిని! విష్ణు సహచర్యంలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆనందంగా ఉండగలననే నమ్మకం నాకుంది!

ఆ క్షణం శ్రీనిలయం చేతులు చాపి ఆదరంగా ఆహ్వానిస్తున్న ఆత్మబంధువులా కనిపించింది!

అవును... ఈ శ్రీనిలయం నా ఆశల నందనోద్యానవనం!

నా సుందర స్వప్నాలను నిజం చేసే మధుర బృందావనం!

నలుగురున్న ఇల్లు నవ్వులతో నందనవనాన్నే మరిపిస్తుందని నా అభిప్రాయం. అందుకే ఎక్కువ మంది ఉన్న ఇంటికి కోడలుగా వెళ్ళాలనేది నా కోరిక! ఆ కోరికకు పునాది తోడబుట్టినవాళ్ళు లేకుండా నేను ఒంటరిగా పెరగటమే అయివుంటుంది.

నన్ను మనసారా ఇష్టపడుతున్నట్లుగా తెలిసిన వ్యక్తినే పెళ్ళి చేసుకోవాలనేది నా మరో కోరిక. పెద్దలు నిర్ణయించే పెళ్ళిలో పిల్లల ఇష్టానికే కాకుండా కట్నకానుకలు, కుటుంబ సాంప్రదాయాలు లాంటి విషయాలెన్నింటికో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతూ ఉంటుంది. ఒక్కోసారి మిగతా విషయాలన్నీ నచ్చితే, పిల్లల ఇష్టాన్ని పక్కన పెట్టేసి పెళ్ళి నిర్ణయించేస్తుంటారు కూడా! పిల్లలే ప్రేమించి పెళ్ళి చేసుకుంటే, వాళ్ళ మొదటి ప్రాధాన్యతా, చివరదీ కూడా ప్రేమదే అవుతుంది. వాళ్ళ ఇల్లు మరో బృందావనమే అనిపిస్తుంది!

నా రెండు కోరికలూ తీరాయి. కాబట్టి ఈ శ్రీనిలయం నాకు నందనవనమూ, బృందావనమూ!

విష్ణునను సరించి ఉత్సాహంగా రెండడుగులు వేయగానే "పెదబాబు... ఆగండాగండీ..." అంటూ దండలతో పరుగున వచ్చినామెను చూడగానే ఆ ఇంట్లో పని చేసే ముత్యాలని పోల్చుకున్నాను. అంతా 'పిచ్చమ్మ' అని పిలుస్తారట. ఆ ఇంట్లో వాళ్ళెవర్నీ ఇంతకు మునుపు నేను చూడకపోయినా గానీ విష్ణు ద్వారా విన్నందువల్ల అందరూ నాకు తెలిసిన వ్యక్తులే అనిపిస్తోంది!

ముత్యాలు సన్నగా, పొట్టిగా ఉంది. చీరె కట్టుకుని పైన మళ్ళీ షర్టు వేసుకుంది. రెండు జడలు! బాగా బిగించి అల్లి చివర పూలు దారంతో పువ్వులాగా ముడివేసినందు వల్లనే అనుకుంటా అవి రెండూ తలకి రెండు పక్కలా నిలబడిపోయినట్లుగా తమాషాగా ఉన్నాయి. చేతికి తాటాకు రిస్టువాచీ! మొహంలో వయసు వచ్చినా వదిలిపోని పసితనం! అదేనేమో పిచ్చి అంటే...!

ఏవో చిన్న చిన్న పూలగుత్తుల్నీ, ఆకుల్నీ కలిపి తనే సొంతంగా కట్టింది కాబోలు, ఆ దండల్ని చూపిస్తూ "పెదబాబూ.. మీ పెళ్ళి సూడలేదుగా.. వీటినేసుకుంటే మేవూ సూసినట్లే అవుద్దిగా..." అంటూ నసిగింది.

"దండలు మా బాగా కట్టావుగానీ దారికడ్డం నెగు..." వెనక నుండి డ్రైవరు కసిరాడు.

"ఎలా కడితేనేంరా... వాసన చూడు... ఎలా గుమాయించేత్తన్నాయో.." తనూ కసిరినట్లు జవాబు చెప్పి, విష్ణు వేపు అభ్యర్థనగా చూస్తూ "పెదబాబూ..." అంది.

విష్ణు ఆ దండల్ని అందుకుని విడదీయబోతే ఒక చోట చిక్కుముడి పడి విడివడలేదు. ఇక ఒకటి అలాగే నా మెడలో వేసి, దానికే వేళ్ళాడుతున్న రెండో దండని నా చేతుల్లో పెట్టారు. దానిని నేను విష్ణు మెడలో వేయగానే "బలే.. బలే..." అంటూ చప్పట్లు కొడుతూ చిన్న పిల్లలా గెంతింది! తనే మా పెళ్ళి జరిపించిన పెద్దలా ఠీవిగా మా ముందు నడుస్తూ "రండి..." అంది.

మేం వేసుకున్న దండలకు కూడ విడివడని ముడి పడిపోవడం నాకు గమ్మత్తుగా అనిపించింది! ఆ దండల నుండి ఏవో మత్తైన వాసనలు! దండలు ఎలా ఉంటేనేం, వాసన ముఖ్యమంటూ ... ఆకారం కంటే అంతరంగానికే విలువ ఇవ్వాలనే విషయాన్ని తెలిసో తెలియకోగానీ ఎంత చక్కగా చెప్పిందీ ..!

మనిషి పిచ్చిదేనేమో... మనసు మాత్రం మంచి ముత్యమే!

విష్ణు కూడా ఆమె మాటల్ని కొట్టిపారెయ్యకుండా ఆదరంగా మన్నించటమూ నాకు నచ్చింది!

మెడలో నుండి తీసిన దండల్ని చేతిలో పట్టుకుని గుమ్మం దగ్గరకు రాగానే అవతల వేపు నిలబడిన అమ్మాయి మాకు హారతి ఇచ్చి "పేర్లు చెప్పందే లోపలకు రానివ్వం ..గా".. అంది చిరునవ్వుతో చూస్తూ.

విష్ణు పిన్ని కూతురు నీరజ అయి ఉంటుందని అనుకున్నాను. చామనచాయ రంగుతో చక్కని ముఖకవళికలతో అందంగా, కళగా ఉంది! పక్కనున్న అయిదారుగురు ఆడవాళ్ళు కూడా "అవును.. పేర్లు చెప్పాలి..." అన్నారు మావేపు నవ్వు మొహాలతో చూస్తూ.

"పేర్లు చెప్పాలి. అంతేగా! నీరజ, వైదేహి, రుక్మిణమ్మగారు, రామాయమ్మగారు..." అంటూ విష్ణు అక్కడున్న వాళ్ళ పేర్లే కాబోలు చెబుతూంటే, అంతా ఫక్కున నవ్వేసారు. "చమత్కారం చాల్లే... మా పేర్లు కాదు... మీవి..." అని ఎవరో అంటున్న మాటలు పూర్తి కానే లేదు...

"పరిహాసాలు చాలు గానీ వాళ్ళను లోపలకు రానివ్వండి.." పదునైన బాణాల్లా దూసుకు వచ్చిన ఆ మాటలకు అంతా ఉలిక్కిపడి తలలు తిప్పి వెనక్కి చూశారు.

హాలులో నుండి మేడ పైకి వెళ్ళే మెట్ల మధ్యలో నిలబడి ఉన్న ఆమె అత్తయ్య అని గ్రహించాను. విష్ణుకు తల్లి పోలికలే ఎక్కువన్నమాట. జానెడు అంచు ఉన్న జరీ చీరెలో చాలా అందంగా, హుందాగా ఉన్న అత్తయ్య వేపు ఒక క్షణం కళ్ళార్పకుండా చూశాను. అత్తయ్య కళ్ళల్లో ఏదో ప్రత్యేకత ఉంది! కరుణకు పుట్టినిళ్ళా అనిపించేటట్లుగా ఉన్నాయి! మాటల్లో.. ఎందుకంత కాఠిన్యం...?

ఒకే ఒక సెకను సేపు నన్ను నిశితంగా చూసీ చూడనట్లుగా చూసి వెంటనే పైకి వెళ్ళిపోయారు! ఆ చూపుల్లో ఇష్టమూ లేదు... అయిష్టమూ లేదు. ఏదో నిర్లిప్తత! అక్కడున్న వాళ్ళ అందరి వదనాలపై క్షణం క్రితం విరిసిన నవ్వుల పువ్వులు వాడిపోయాయి! తప్పు చేసి పట్టుబడ్డవాళ్ళలా అందరూ తలలు వంచుకుని మెల్లగా వెళ్ళిపోయారు.

విష్ణు పెళ్ళి సాంప్రదాయంగా, అత్యంత వైభవంగా జరగాలనే కోరిక అత్తయ్యకు ఉందని నాకూ తెలుసు. తన కోరికకు విరుద్ధంగా విష్ణు రిజిష్టర్ మ్యారేజి చేసుకున్నందుకే కోపం వచ్చిందా..? తండ్రి అనారోగ్యంతో మంచం పట్టి ఉన్న పరిస్థితులలో విష్ణు నిర్ణయం సమంజసమైనదేగా! రిజిష్టర్ మ్యారేజీ చేసుకుని వచ్చిన వాళ్ళకు పేర్లు చెప్పటం లాంటి సాంప్రదాయకమైన ముచ్చట్లు మాత్రం ఎందుకూ అని అత్తయ్యకు చిరాకు కలిగిందా.. లేక అసలు ఈ పెళ్ళే ఇష్టం లేదా? విష్ణు మాటల్ని బట్టి ఇంట్లో వాళ్ళకి తన పెళ్ళి ఇష్టం లేదేమోననే ఆలోచన అప్పటి వరకూ నాకు రాలేదు. అప్పుడే అనుమానం వచ్చింది. కాసేపటిలోనే అది నిజమని నమ్మకంగా అనిపించింది!

పైన అత్తయ్య గదిలోకి వెళ్ళి ఆశీర్వాదం కోసం అత్తయ్య కాళ్ళకు నమస్కరించబోతోంటే “ఇవన్నీ ఏమిటి...” అన్నారు కాళ్ళను వెనక్కి జరుపుకుంటూ. “అమ్మా...” అంటూ విష్ణు ఏదో చెప్పబోతుంటే “తర్వాత మాట్లాడుకోవచ్చులే... ముందు మీగదిలోకి వెళ్ళి రెస్టు తీసుకోండి...” నిర్లిప్తంగా అన్నారు. నాకయితే... కోపంగా కాకుండా కూల్‌గా “గెటవుట్” అనే విధానం ఒకటి ఉందని మొదటిసారిగా అర్థమైంది! మనసంతా చేదుగా అయింది!

విష్ణు నిస్సహాయంగా నిట్టూర్చి వచ్చేస్తుంటే, అక్కడే టీపాయ్ మీద పెట్టిన దండలను తీసుకుని గుమ్మం దాటుతూ ఒక క్షణం వెనక్కి తల తిప్పి చూశాను.

అత్తయ్య చెంపల మీదుగా కన్నీళ్ళు కారుతున్నాయ్! నాకు మనసులో కలవరం రేగింది! పక్కగదిలోనే మామయ్యగారున్నారు. ఇద్దరం మంచం మీదే పక్కన రెండు నిముషాలు కూర్చున్నాం. ఆయన మా వేపు తదేకంగా చూశారు గానీ ఆ చూపుల్లో ఏ భావమూ లేదు. వెంటనే అటువేపు ఒత్తిగిల్లి పడుకున్నారు. ఎవరినీ గుర్తుపట్టకుండా పూర్తిగా కోమా, మెలకువా కాని స్థితిలో ఆరు నెలలుగా అలాగే ఉంటున్నారట! ఆయన పాదాల్ని తాకి నమస్కరించి నిశ్శబ్దంగా వచ్చేశాం.

ఆ ఇంటి వాతావరణంలోనే ఏదో అసహజత్వం ఉందనిపించింది. నా భ్రమో, నిజమో తెలియదు మరి!

ఇక్కడకు రాగానే అందరి పలకరింపులు, పరిచయాలతో ఎంతో సందడిగా, హడావుడిగా ఉంటుందనుకున్నాను. అత్తయ్యనే కాదు. ఎవరి చూపుల్లోనూ అప్యాయత, ఆహ్వానం లేవు. పైగా ఏదో విస్మయం! వాళ్ళ అంచనాకు తగ్గట్టుగా విష్ణుకు నేను సరిజోడిగా లేనేమో!

అప్పుడే అటువేపు గదిలో నుంచి బయటకు వచ్చిన కృష్ణప్రసాద్‌కు విష్ణు నన్ను పరిచయం చేస్తోంటే అతను కూడా నన్ను చూసీ చూడనట్లుగా చూసి “డాక్టర్ యశ్వంత్‌గారిని రిసీవ్ చేసుకోవడానికి వెళ్తున్నాన్నయ్యా...” అని హడావుడిగా చెప్పేసి వెళ్ళిపోయాడు.

విష్ణు పిన్ని కామాక్షిగారయితే నన్ను తదేకంగా పరికించి చూసి ఎందుకోగానీ గట్టిగా నిట్టూర్చారు! నాకర్థం కాలేదు!

అత్తయ్య గదికి ఎదురుగా హాలుకి అటువేపుగా ఉన్న గదిలోకి తీసుకెళ్ళి "నిన్నటి వరకూ ఇది నా గది మాత్రమే. ఈ రోజు నుండి మనిద్దరి సామ్రాజ్యం..." నవ్వుతూ అన్నారు. నేను నిర్లిప్తంగా ఉండిపోయాను.

అన్ని ఆధునిక సదుపాయాలతో గది చాలా అందంగా విశాలంగా ఉంది. బెడ్ మీద ఆకుపచ్చని ఆకులు రాలిపడినట్లుగా ప్రింట్ ఉన్న వైట్ కలర్ బెడ్ షీటూ... కిటికీలకు నీలిరంగు కర్టెన్లు... గోడలకు జలపాతం దగ్గిర వయ్యారంగా నిలబడిన యువతి పెయింటింగ్ ఒకటీ, పూల గుత్తుల మధ్య నవ్వుల్ని విరజిమ్ముతున్న ఇద్దరు చిన్నారుల పెయింటింగ్ మరొకటీ ... ఒక వార నున్న సోఫాల మధ్యగా గాజు టీపాయ్ మీదున్న ఫ్లవర్ వాజ్‌లో ఎర్రెర్రగా నవ్వుతున్న తాజా రోజాపూలు... అన్నింటినీ ఒక నిమిషంలోనే పరికించి చూశాను.

నిర్లిప్తంగా నిలబడిపోయిన నా రెండు భుజాలపై విష్ణు చేతులు వేసి, "సుజనా, ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని నేనూహించలేదు! లేకపోతే పెళ్ళికి తొందరపడకుండా కొన్నాళ్ళు ఆగేవాడినే. నిన్ను ఇబ్బంది పెట్టాననిపిస్తోంది. నాలుగు రోజులు గడిస్తే అమ్మ... తప్పకుండా మామూలవుతుంది. నువ్వు... నాకోసం... అంతవరకూ..."

ఇక ఏం మాట్లాడాలో తోచనట్లుగా మధ్యలో ఆగిపోయారు.

విష్ణు మాటల్లోని అనునయానికి కరిగిపోయాను. విష్ణు అండ చాలు అనుకున్నాను. మనసు కొంచెం తేలికపడినా గానీ లోలోపల మాత్రం ప్రశ్నలు చెలరేగుతూనే ఉన్నాయి! పెళ్ళికి తొందరపడకుండా కొన్నాళ్ళు ఆగాల్సిందేమోనని ఎందుకనుకుంటున్నారు? మామయ్యగారి ఆరోగ్యం ఎప్పటికి కుదుటపడుతుందో చెప్పలేమని డాక్టర్లు అన్నారనేగా పెళ్ళి నిర్ణయించుకున్నారు! అసలు ఇంట్లో వాళ్ళంతా ఎందుకలా ముభావంగా ఉన్నారో...! నా సందేహాలకు సమాధానం కొంత ఆ మధ్యాహ్నమే లభించింది.

విష్ణు కాసేపటిలోనే ఎవరినో అర్జంటుగా కలవాలని ఫోను వస్తే హడావుడిగా తయారైపోయారు. ఆ ఇంట్లోకి అడుగుపెట్టిన కాసేపటిలోనే విష్ణు లేకుండా ఒంటరిగా ఉండాలంటే కొంచెం దిగులుగా అనిపించింది.

"సుజనా... నువ్వు మొహమాటంగా ఉండకు. నువ్వు ఎవరి ఇంటికో అతిథిగా రాలేదు. ఇది నీ ఇల్లు కూడా. నీకేం కావాల్సినా నీరజను అడుగు. తప్పనిసరి కాబట్టి

వెళ్ళాల్సి వస్తోంది...” అని “రవిగారు తన ఇంటికి బయలుదేరే సమయానికల్లా నేనూ మనింట్లో ఉంటాగా...” అంటూ నవ్వారు.

రవిగారెవరన్నట్లుగా ఆశ్చర్యంగా చూశాను.

అక్కడే ఉన్న ఆ రోజు పేపరును తీసి సూర్యాస్తమయం అని రాసి టైము వేసి ఉన్న చోటు చూపించారు. నాకూ నవ్వొచ్చింది.

❊ ❀ ❊

నీరజ నాకేం కావాలో బాధ్యతగా పదే పదే కనుక్కుంది. సూట్‌కేసుల్లోని నా బట్టలు తీసి సర్దుకోవటం, కాఫీ, టిఫిన్లులాంటి పనులయ్యాక ఇల్లంతా తిప్పి చూపించింది. ఆ ఇంటిని చూస్తుంటే నాకు తెలియని కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లుగా అయోమయంగా అనిపించింది. ప్రతీ చిన్న విషయం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకొని ఎంతో అందంగా, కళాత్మకంగా తీర్చిదిద్దినట్లుగా తెలుస్తోంది! అలంకరణ కోసం అక్కడక్కడా ఉంచిన వస్తువుల్ని ఎక్కడెక్కడి నుండి ఏయే దేశాల నుండి, ప్రదేశాల నుండి తెచ్చారో, నీరజ వివరంగా చెప్పింది. విష్ణు వాళ్ళిల్లు శ్రీనిలయం చాలా గొప్పగా ఉంటుందని విన్నానని భవానీ ఆంటీ నాతో చెప్పింది గానీ ఇంతలా ఉంటుందని ఊహించలేకపోయాను. ఇల్లే కాదు, విష్ణు మాటల్ని బట్టి ఇంట్లో వాళ్ళ ప్రవర్తనా వేరే విధంగా ఉంటుందని ఊహించాను. అందరూ మా చుట్టూ చేరి పరిచయాలూ, పరిహాసాలతో సందడి చేస్తారని అనుకుంటే... జరగకూడనిదేదో జరిగినట్లుగా పరిస్థితి ఇలా ఉంది! నా అంచనా అన్ని విషయాల్లోనూ తప్పింది!

ఊహలెప్పుడూ వాస్తవ విరుద్ధంగా ఉంటాయి కాబోలు!

పక్కింటి అమ్మాయిలు నన్ను చూడడానికి వచ్చారని నీరజ నన్ను హాలులోకి తీసుకెళ్ళింది. చదువుకుంటున్న అమ్మాయిల్లా ఉన్నారు. కాలేజీకి వెళ్తూ వచ్చారు కాబోలు. చేతుల్లో పుస్తకాలు ఉన్నాయి. నీరజ నన్ను కూర్చోబెట్టి పరిచయం చేసి పనిమీద లోపలకు వెళ్ళిపోయింది. వాళ్ళు కళ్ళప్పగించి చూస్తూంటే నేనే ఏం చదువుతున్నారు? లాంటి ప్రశ్నలు వేస్తూ మాటలు కలిపాను.

రెండు నిమిషాలకే వెళ్ళి వస్తామంటూ లేచి నిలబడేసరికి నేనూ సరేనంటూ తలవూపి లోపలకి వచ్చేస్తుంటే, వాళ్ళిద్దరి మాటలూ నా చెవిని బడ్డాయ్.

వెళ్తూ ఒకమ్మాయి చాలా మెల్లగా “శ్రీలక్ష్మి కంటే అందంగా ఉంటుందని అనుకున్నానే...” అని అంటే, ఇంకో అమ్మాయి కూడా గుసగుసగా “శ్రీలక్ష్మిలాంటి వాళ్ళే చాలా అరుదుగా ఉంటారు... అంతకన్నా అందమైనవాళ్ళు ఉండనే ఉండరేమో...” అంటోంది.

శ్రీలక్ష్మి ఎవరో..?! వాళ్ళ స్నేహితురాలో, బంధువుల అమ్మాయో అయివుంటుందని అనుకున్నాను. విష్ణు ఇష్టపడి పెళ్ళి చేసుకున్న అమ్మాయి కూడా అంత అందంగా ఉంటుందని వాళ్ళు ఊహించారు కాబోలు! అయినా అదేం పోలిక అని మనసులోనే నవ్వుకున్నాను కానీ... నా జీవితాన్ని ఓ కుదుపు కుదిపే ప్రముఖ పాత్ర శ్రీలక్ష్మిదని ఆ తర్వాత తెలిసి వచ్చింది!

❊ ❀ ❊

ఆ మధ్యాహ్నం నా దగ్గరకు కామాక్షి అత్తయ్య, నీరజ రెండు సూట్‌కేసులు తెచ్చారు. ఒక దానిలో పది వరకూ ఖరీదైన పట్టుచీరలూ, రెండో దానిలో నగలూ ఉన్నాయి. చీరలన్నిటినీ మడతలు కొంచెంగా విప్పి పమిటకొంగులూ చూపించి నీరజ “ఎలా ఉన్నాయి?” అని అడిగితే “బావున్నాయి” అన్నాను.

ఆ తర్వాత నీరజ నగల బాక్సులన్నిటినీ తెరిచి చూపిస్తోంటే కామాక్షి అత్తయ్య వాటి గురించి చెప్పుకొచ్చారు. వాటికి చాలా చరిత్ర కూడా ఉంది మరి! అప్పుడెప్పుడో ఒకసారి అత్తయ్య కోయంబత్తూరు వెళ్ళినప్పుడు... తెలిసిన జమీందారి గారి భార్య మెడలోని కెంపుల హారాన్ని చూసి ఇక్కడయితే అంత బాగా చేయరేమోనని అక్కడే చేయించారట. ముత్యాల హారాన్ని కాశ్మీరులో, పచ్చల సెట్‌ని బెంగుళూరులో, ఇంకొకటి ఇంకోచోట.. అలా ఆ నగలన్నిటిని ఎప్పటి నుండో, ఎక్కడెక్కడో నచ్చినవి కొంటూ, చేయిస్తూ వచ్చారట!

నగలపట్ల అత్తయ్యకున్న శ్రద్ధకూ, అభిరుచికీ ఆశ్చర్యంగా అనిపించింది. అయితే అవి చూపిస్తూ వాటి గురించి చెబుతున్నప్పుడు చిన్నత్తయ్య మాటి మాటికి నిట్టూర్చటం, తనలో తానుగా ‘ఎవరికేది ప్రాప్తమో...’ అని స్వగతంలా గొణుక్కోవడం నాకర్థం కాలేదు!

అవన్నీ నాకెందుకు చూపిస్తున్నారా అని అనుకుంటూంటే అత్తయ్య నా కోసమే వాటిని పంపించారని నీరజ చెప్పగానే ఒక క్షణం బిత్తరపోయాను! ఒక క్షణం నా వేపు

నిదానంగా చూడటానికి గాని, పలుకరించటానికి గానీ ఇష్టపడని అత్తయ్య... నాకోసం... ఇంత విలువైన నగల్ని, చీరెల్నీ ఇవ్వటం ఏమిటి...?! విడ్డూరంగా ఉంది!

కోడలికి ఇచ్చే నగలనే అంత శ్రద్ధగా ఎప్పటి నుండో చేయించారంటే, విష్ణు పెళ్ళిని ఏ రీతిలో ఎంత వైభవంగా చేయాలని అనుకున్నారో ఊహించగలను! సహజంగా ఏ కోటీశ్వరుల అమ్మాయో తన కోడలుగా వస్తుందని అత్తయ్య అనుకుని ఉంటారు. అందుకే అంత ఖరీదైన నగలు తమ స్థాయికి తగ్గట్టుగా చేయించారన్నమాట! అయితే అనుకోని విధంగా విష్ణు నాలాంటి సామాన్య కుటుంబం నుండి వచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకోవటంతో అత్తయ్య ఆశలన్నీ తలక్రిందులైపోయాయి కాబోలు! మామూలు కథే!

తమ స్థాయి ఏమిటో నాకు తెలియజేయటానికీ తన అయిష్టతను స్పష్టం చేయటానికీ కూడా అత్తయ్య తను ఇవ్వకుండా ఇలా పంపించారని నాకు అనిపించింది!

వాటిని సూట్‌కేసుల్లో యథాప్రకారం సర్దేసి నీరజ వేపుకి జరిపి చెప్పాను "ఇతంత జరీ ఉన్న పట్టుచీరెల్ని కట్టుకోవటమూ, ఇలాంటి నగల్ని పెట్టుకోవటమూ నాకు అలవాటు లేదు. ఇష్టమూ ఉండదు. అత్తయ్యకు ఇచ్చెయ్యండి."

చిన్నత్తయ్య కళ్ళు ఇంత చేసుకుని నా వేపు విడ్డూరంగా చూశారు. "పెళ్ళిలో కోడలికి నగలు, చీరెలు ఇవ్వటం సాంప్రదాయం కదా, వద్దనటం ఏమిటీ... నీకు తెలుసా... అవి ఎంత ఖరీదైనవో..."

ఆమె మాటలు పూర్తికాకముందే నేనే చెప్పేశాను "అవి ఖరీదైనవయినా నాకు ఉపయోగపడనప్పుడు అనవసరమే కదాని వద్దంటున్నాను."

నా కంఠస్వరంలోని స్థిరత్వాన్ని నీరజ గమనించింది కాబోలు అందుకే చిన్నత్తయ్య మళ్ళీ ఏదో అనబోతోంటే వారించింది. ఇద్దరూ ఆ సూట్‌కేసుల్ని తీసుకొని వెళ్ళిపోయారు.

అత్తయ్య ఆప్యాయంగా ఇవ్వలేదనే కాదు, నాకు నగల పట్ల ఆసక్తి లేకపోవటమూ నిజమే. దానికి కారణం నాన్నగారే!

ఒకసారి నా చిన్నప్పుడు నా పుట్టిన రోజున పక్కింటి అమ్మాయి తన పుట్టిన రోజుకి కొనుక్కున్న గొలుసులాంటిదే నాకూ కొనమని గొడవ చేశాను. వీలు చూసుకొని కొంటానని నాన్నగారు అన్నా వినిపించుకోలేదు. అలిగి కూర్చున్నాను. అప్పుడు నాన్న గారు నన్ను ఒడిలో కూర్చోబెట్టుకుని అనునయంగా చాలా సేపు కబుర్లు చెప్పారు.

నగలతో వచ్చే అందం కంటే చక్కని చిరునవ్వు, మంచి ప్రవర్తనతో పొందే గుర్తింపు విలువైనదంటూ ఉదాహరణలుగా రెండు కథలు చెప్పారు. ఆ తర్వాత మహాత్మాగాంధీ, స్వామీ వివేకానందల జీవితాల్లోని కొన్ని సంఘటనల్నీ నా మనసులో హత్తుకునేట్లుగా ఎంత బాగా చెప్పారంటే.. ఆ తర్వాతెప్పుడూ కూడా నేను నగలు కావాలని నాన్నగారిని అడగలేదు. కొనుక్కోవాలనే కోరిక కలగలేదు కూడా!

ఆ రోజే నాన్నగారు నన్ను పుస్తకాల షాపుకి తీసుకెళ్ళి రెండు మూడు కథల పుస్తకాలతో పాటు వివేకానందుని జీవిత చరిత్ర కొన్నారు. ఆ పుస్తకంలో అట్ట తర్వాత మొదటి పేజీలో ఒక మంచి వాక్యం రాశారు.

చిరునవ్వే చంద్రకిరణం!

చిన్నారికి అదే అందమైన ఆభరణం!

ఆ పుస్తకాన్ని అప్పుడు చదవలేదుగానీ ఆ తర్వాత మాత్రం చాలాసార్లు చదివాను. నాన్నగారు నాకు ఇచ్చిన విలువైన కానుకగా ఆ పుస్తకాన్ని భద్రంగా దాచుకున్నాను. పుస్తకాలు చదివే నా అలవాటుకు నాన్నగారే బాట వేశారు. ఎప్పుడు బజారుకెళ్ళినా నేను ఇష్టంగా కొనుక్కునేవి పుస్తకాలే!

❊ ❀ ❊

సాయంకాలం విష్ణు ఇంటికి వచ్చాకనే నాలోకి ఉత్సాహం, ఊపిరీ వచ్చాయి!

విష్ణు తన రిష్టువాచీలో టైము చూసుకుంటూ "సారీ... అరగంట లేటయింది" అన్నారు. పేపరులోని సూర్యాస్తమయ వేళ దాటి అరగంటయిందని అలా అన్నారని అర్థమైంది.

"అరగంట కాదు.. యాభై నిమిషాలు..." అన్నాను.

"అదెలా?" అన్నారు కళ్ళెగరేస్తూ

"నిమిషాలు లెక్కబెట్టుకుంటూ ఎదురు చూస్తున్న నా మీద జాలిపడి రవిగారు తన షెడ్యూలు ప్రకారం కాకుండా ఇరవై నిమిషాలు ముందుగానే బయలుదేరి పోయారు. మీరది గమనించలేదు కాబోలు!"

విష్ణు నవ్వేశారు. "ఈ రోజు ప్రతి నిముషం విలువైనదేనని చెప్పకనే చెప్పటం... అవునా? నీలో ఛమక్ చాలా ఉందే...!!" అంటూ నా చెంపపై చూపుడు వేలితో గీత గీసి హడావుడినభినయిస్తూ బాత్‌రూములోకి వెళ్ళారు.

విష్ణు తాకిన చెంపకి చేయి ఆనించుకుని రెండు నిముషాలు అలాగే ఉండిపోయాను.

విష్ణు స్నానం చేసి వచ్చేలోపు కాలక్షేపానికి టి.వి. ఆన్ చేశాను. విష్ణు గదిలోకి వస్తూనే "సుజనా నువ్వొక మాట ఇవ్వాలి" అన్నారు సీరియస్‌గా.

"ఏమిటి?" అన్నాను.

"రోజంతా పగలు నీ ఇష్టమే కానీ నేను ఇంట్లో ఉన్నప్పుడు ఈ గదిలో ఏదైనా ప్రత్యేకమైన ప్రోగ్రామ్‌ని ఇద్దరం చూడాలనుకుంటే తప్ప నువ్వు టివి ఆన్ చేయకూడదు! నీ చూపులు దేనిమీద ఉండకూడదు! కేవలం..." తన మీదే ఉండాలన్నట్లుగా చూపుడు వేలుని తన వేపుకి చూపించి "సరేనా?" అని అడిగారు.

నేను చిరునవ్వుతో "థేంక్స్. అలాగేనని మాట ఇస్తున్నాను... ఎప్పుడూ తప్పను!" అన్నాను.

"థేంక్స్ దేనికీ?"

"ఎందుకంటే... మీ షరతు నాకు అడగకుండానే ఇచ్చిన వరంలాంటిది కనుక!"

అద్దంలో చూస్తూ క్రాఫ్ దువ్వుకుంటూ "నువ్వు చాలా మంచి అమ్మాయివి.." అన్నారు.

"ఇందులో మంచితనం ఏముందీ?" అర్థం కాక అడిగాను.

"లేకపోవడం ఏమిటి.. "మీరుంటే టీవి చూడకూడదా ... ఈ ఇంట్లో నాకా మాత్రం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవా... పెత్తనం అంతా మీదేనా? నేను మనిషిని కాదా? నాకు ఇష్టాయిష్టాలు ఉండవా?" అని గొంతు పెంచి వాదించకుండా వెంటనే నా మాటని మన్నించావు కదా!"

విష్ణు తమాషాగా మాట్లాడుతూ చేసిన అభినయానికి పెద్దగా నవ్వేశాను.

"పొరపాటు పడ్డారు. రోగి కోరిన పథ్యాన్నే వైద్యుడూ చెప్పాడన్నట్లుగా నా కిష్టమైన దాన్నే మీరూ అడిగారు కాబట్టి ఆనందంగా ఒప్పేసుకున్నాను. నాకు నచ్చని విషయమైతే, ఇదిగో సరిగ్గా మీరన్నట్లుగానే నానా రభస చేసేస్తాను! తెలుసుకోండి" హెచ్చరికలా అన్నాను.

"ఓ.. అంత సత్తా ఉందా...?! చూద్దాం... అలాంటి సీను కూడా ఎదురవుతుందేమో!" అంటూ నవ్వారు.

క్రిందకి డైనింగు హాలు దగ్గరకు ఇద్దరం వెళ్ళాం. అందరం కలిసి ఒక్కసారే భోజనం చేసినా గానీ మాటలు లేవు. ఎవరికి వాళ్లు నిశ్శబ్దంగానే ముగించారు.

## 2

నేను గదిలోకి వచ్చి కూర్చున్న గంట తర్వాత విష్ణు వచ్చారు. చేతిలో చిన్న సూట్‌కేసు ఉంది.

“సుజనా... అమ్మ ఇచ్చిన నగలు వద్దన్నావట.. ఎందుకనీ?” అని అడిగారు.

“కోడలు కోరుకునేది రవ్వంత అభిమానమే గానీ రవ్వల నగలు కాదని తెలుసుకుంటారని!”

“రవ్వంత అభిమానమైనా లేకుండా ఎవరైనా కానుకలు ఇస్తారా?” చురుగ్గా చూస్తూ అన్నారు.

“ఇస్తారని నాకూ ఈ రోజేగా తెలిసింది! తమ స్థాయి, స్థోమతు తెలియజేయడానికి ఇవ్వొచ్చునేమో!”

“సుజనా...” అంటూ ఏదో చెప్పబోయిన విష్ణు ఎందుకనో ఆగిపోయి నిట్టూర్చారు. బీరువా తీసి ఆ సూట్‌కేసును లోపల పెడుతూ “నీక్కావలసినవి తీసుకొని మిగతావి లాకర్‌లో పెడదాం ప్రస్తుతానికి ఇక్కడే పెడుతున్నాను” అన్నారు.

“పెట్టండి. నన్ను పెట్టుకోమని మాత్రం ఎప్పుడూ చెప్పకండి” స్థిరంగానే అన్నాను.

“సరే. నీకేదయినా నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తానేమోగానీ నచ్చని పనిని చేయమని నేనూ ఎప్పుడూ చెప్పను!” అంటూ వచ్చి బెడ్ మీద కూర్చున్నారు.

“సుజనా... ఈ ఇంటి పరిస్థితి అర్థం కావడానికి నీకు కొన్నాళ్ళు పడుతుంది. నీకు కొన్ని విషయాలు చెప్పాలి. ఇప్పుడు కాదు. నిదానంగా తర్వాతెప్పుడో చెబుతాను. నా మీద బాధ్యతల బరువు ఎక్కువగానే ఉంది. బాబాయ్ యాక్సిడెంట్‌లో చనిపోయాక పిన్నినీ, నీరజనూ ఇక్కడకు తీసుకువచ్చాం. మంచి వ్యక్తితో నీరజ పెళ్ళి జరగాలి. ఈ సంవత్సరంలో తమ్ముడి చదువు పూర్తవుతుంది. హాస్పిటల్ కట్టాలి. తన పెళ్ళి జరగాలి. నాన్నగారు ఏ సలహా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. బిజినెస్‌లన్నీ ఒడిదుడుకుల్లో ఉన్నాయి. వాటిని తట్టుకోవాలి. ఇవన్నీ సరే, ఇంట్లో నేను ఒంటరివాడినైపోయాను. అదే సమస్యగా అనిపించింది! అందుకే.. నువ్వు తోడుంటేనే నాకు శక్తి, ఉత్సాహం

వస్తాయని... పెళ్ళిని ఇంకా వాయిదా వేయలేక తొందరపడ్డాను!" విష్ణు కంఠం బరువుగా మారింది.

ఇంతమంది ఉన్న ఇంట్లో విష్ణుకు ఒంటరితనమేమిటి..? అర్థం కాలేదు. ఎప్పుడో నిదానంగా చెబుతానన్నారు కదాని నేనేమీ అడగలేదు. మౌనంగానే ఉండిపోయాను.

అత్తయ్య ఇచ్చిన నగలు వద్దన్నందుకు విష్ణు మనసుకు కష్టంగా అనిపించిందా అని అనుమానం వచ్చింది.

నాకు నగల పట్ల ఆసక్తి లేకపోయినా, అత్తయ్య అభిమానంగా ఇచ్చి ఉంటే నేను కాదని అనలేకపోయేదాన్నేమో! ఆప్యాయంగా కాకపోయినా మామూలుగానయినా మాట కలపని అత్తయ్య నగలు పంపిస్తే ఎలా తీసుకోగలను?

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

విష్ణు ప్రశ్నకి నిట్టూర్చాను.

"ఈ ఇంట్లో వాళ్ళెవరికీ మీకు సరిజోడీగా నేను నచ్చలేదనుకుంటాను. ఎవరి చూపుల్లోనూ కనీసం పాస్ మార్కులు కూడా లేవు!"

"ఎవరికైనా మనమీద ఇష్టం ఏర్పడాలంటే, మనమేమిటో తెలియటానికి కొంత సమయం పడుతుంది. అవునా?" అన్నారు.

"అవును గానీ... చూసిన వెంటనే అయిష్టం కలగటానికి... ఏదో కారణం ఉంటుందిగా? మీరు ఇష్టపడి పెళ్ళి చేసుకున్న అమ్మాయి ఇలా ఉందేమిటీ? అన్న ఆశ్చర్యమే కాబోలు అందరిలోనూ కనిపిస్తోంది! ఇప్పుడు ఆలోచిస్తుంటే నాకూ ఆశ్చర్యంగా ఉంది. మీకు మాత్రం ఎలా నచ్చానా అని!" బెడ్ వెనక ఆనుకుని కూర్చున్న నేను రెండు కాళ్ళు ముడుచుకుని వాటిపై తల ఆనించాను.

"నీకిలాంటి సందేహం కూడా ఉందా...?! ఎంతటి వాళ్ళయినా సరే నిన్నిష్టపడకుండా ఉండలేరని మనసులో గర్వపడుతూంటావని నేను అనుకుంటున్నానే!" అంటూ అటువేపు కూర్చున్న విష్ణు ఏటావాలుగా పడుకుని ఒక చేయిపై తల ఆనించి చిరునవ్వుతో చూశారు. "అందరి సంగతీ తెలియదు కానీ నాకు మాత్రం... బ్రహ్మదేముడు నా ఇష్టాలన్నీ తెలుసుకుని మరీ సృష్టించిన అమ్మాయివి నువ్వని నీతో పరిచయం కలిగిన కొన్నాళ్ళకే స్పష్టమైపోయింది! అందుకే గదా నీ ప్రేమ కోసం ఒకటే ఆరాటపడి... నువ్వు కాదంటావేమోనని బెంగపడి.. అంగీకరించగానే ఆనందంతో ఎగిసిపడి...

పెళ్ళయిన తర్వాత నీ చేయి అందుకోగానే గర్వంతో మిడిసిపడి... ఇపుడు నీ ముందు ఇలా సాగిలపడి...."

విష్ణు అలా అల్లరిగా చెబుతోంటే "ఇంకా... మరీ పడిపోకండి... చాలు..." అంటూ నవ్వేశాను. ఆ క్షణాలలో నా మనసు చుక్కల లోకం వరకు వెళ్ళి చక్కర్లు కొట్టేసి వచ్చింది!!

విష్ణు వెంటనే లేచి కూర్చుని హుషారుగా "హమ్మయ్య... నువ్వు మంచి మూడ్‌లోకి వచ్చేశావు కాబట్టి ఇప్పుడు చెప్పు.. ప్రోగ్రాం ఏమిటి... ఏం చేద్దాం?" అన్నారు. ఆ కంఠస్వరంలో ఏదో కొంటెతనం!

"భజన!" అన్నాను నవ్వు రాకుండా పెదవుల్ని నొక్కిపెట్టి.

విష్ణు గట్టిగా నిట్టూర్చారు. "పొద్దుటి నుండీ నేను మనసులో చేస్తున్నదదేగా, సుజన... సుజన అంటూ భజనే!"

"నేనూ అంతే. మీ సాక్షాత్కారం కోసం ఎదురు చూస్తూ మనసులో విష్ణునామ సంకీర్తనే"! ఇద్దరికీ నవ్వొచ్చింది.

రెండు నిమిషాల తర్వాత "అమ్మ ఇచ్చిన నగలు వద్దన్నావు సరే, మొదటిసారిగా నా కానుకగా నీకేం కావాలో చెప్పు సుజనా. అడగకుండానే ఇవ్వొచ్చుగానీ నీ కిష్టమైనవి ఇవ్వటం బావుంటుందని!" అనడిగారు.

నేను వెంటనే అప్రయత్నంగా "ఈ ప్రేమ ఎప్పటికీ ఇలాగే ఉండాలి! అది చాలు!" అన్నాను.

విష్ణుతో నా పెళ్ళి ప్రసక్తి వచ్చినప్పుడు నాన్నగారు వెలిబుచ్చిన భయాలు, సంశయాలు నా మనసు మీద నాకు తెలీకుండానే ప్రభావం చూపినట్లున్నాయి. అందుకే నిముషమైనా ఆలోచించకుండా అలా అడిగాననుకుంటాను.

విష్ణు భుజాలు ఎగరేస్తూ "సారీ... అలాంటి హామీ మాత్రం ఇవ్వలేను!" అనేసరికి తుళ్లిపడ్డాను. అలాంటి సమాధానాన్ని ఊహించలేదు మరి!

"ఎందుకనీ?" ఆశ్చర్యంగా అడిగాను.

నా వేపు సీరియస్‌గా చూస్తూ "ఎప్పటికీ ఈ ప్రేమ ఇలాగే ఉండాలంటే ఎలా వీలవుతుందో నువ్వే చెప్పు. అనుభవాలతో రోజు రోజుకీ పెరుగుతుంటుందిగా, క్వాంటిటీలో తేడా రాదూ?"

విష్ణు మాటలకి హాయిగా నవ్వాను.

నా చేయి పట్టుకుని అరచేతిలో గీతలు రాస్తూ అన్నారు "నువ్వు అడిగినట్లుగా మాట ఇస్తే మాత్రం ఏం లాభం? ఆ మాట తప్పనని ఇంకో మాట కూడా ఇవ్వాలి. అవునా? ప్రేమించి ప్రేమను పొందినట్లుగానే ప్రేమను ప్రేమతోనే నిలబెట్టుకోవాలి! అది ఇద్దరి చేతుల్లోనూ ఉంటుంది!"

నిజమే కదా అనిపించింది.

పెదవులు పలికే మాటలు చాలు ఇక... చేతులు చెప్పే సంగతులు వినమని చెబుతున్నట్లుగా విష్ణు చూపుల్లోకి చిరునవ్వులు వచ్చాయి! తన చేతులు నా చుట్టూ బిగుసుకున్నాయి.

శశికిరణాలు సోకగానే కన్నె కలువ మొగ్గ పూవై విరిసి పరవశించినట్లుగా విష్ణు చేతుల్లో ఇష్టంగా ఇమిడిపోయాను.

✻ ❀ ✻

మరునాడు ఉదయమే తొందరగా మెలకువ వచ్చేసింది.

విష్ణు గాఢంగా నిద్రపోతున్నాడు. నేను మెల్లగా లేచి స్నానపానాదులన్నీ ముగించుకున్నాను. మునుపు మా ఇంట్లో అయితే ఇలా పెందరాళే లేచినప్పుడు వెనక పెరట్లో ఉన్న అరుగు మీద కాసేపు కూర్చునేదాన్ని. వెలుగు రేకలు విచ్చుకుంటున్న సమయంలో ఆరుబయట కూర్చోవటం... అక్కడే ఉన్న వేప చెట్టు మీది పక్షుల కిలకిల ధ్వనుల్ని వినటం చాలా ఇష్టంగా ఉండేది! ఆ పక్షులన్నీ అంత గోలగోలగా ఏం కబుర్లు చెప్పుకుంటున్నాయో అనే ఆలోచనలూ వచ్చేవి!

మెల్లగా తలుపులు తీసుకొని బయటకు వచ్చాను. ఎవరూ లేవలేదేమో, అలికిడి లేదు. వెనక వేపున్న బాల్కనీలోకి వచ్చి నిలబడ్డాను. ప్రశాంతంగా, హాయిగా అనిపించింది!

వెనక వేపు అవుట్ హౌస్ ఉంది. శ్రీనిలయం కట్టేటప్పుడు అజమాయిషీ చేస్తూ అన్ని పనులూ చూసిన మామయ్యగారి స్నేహితులు నారాయణరావుగారి కోసమే ఆ అవుట్ హౌస్ కట్టారని విన్నాను.

రెండుగదుల డాబాకి ముందు పెంకుల వసారా ఉంది. ముందు తులసికోట, కొంచెం పక్కగా అటువేపుకి చుట్టూ సిమెంట్ చప్టా ఉన్న నుయ్యి... ఇంకో పక్కగా